ప్రజాశక్తి

శనివారం 14 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



రోడ్డుపై టైర్లు తగలబెట్టి ఆందోళన చేస్తున్న టిడిపి కార్యకర్తలు

రోడ్డుపై టైర్లు తగలబెట్టి..

- శింగరాయకొండలో టీడీపీ ఆందోళన
- చంద్రబాబునాయుడు ఆరోగ్యంపై ఆందోళనగా ఉంది
- కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనగా ఉందని శుక్రవారం రాత్రి శింగరాయకొండలో ఎమ్మెల్యే స్వామి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నడిరోడ్డుపై టైర్లను దహనం చేసి.. నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు వరకు ర్యాలీగా వచ్చారు. కందుకూరు రోడ్డు వద్ద మానవహారం నిర్వహించి.. రోడ్డుపై టైర్లను పెట్రోల్ పోసి తగలబెట్టి నిరసన తెలియజేశారు. దాదాపు గంట పాటు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితిపై తెలుగు దేశం శ్రేణుల్లో ఆందోళనగా ఉందని, దీనికి జగన్ సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందం కోసం చంద్రబాబుపై ఎలాంటి ఆధారాలు లేని కేసులు పెట్టి ఆనంద పడుతున్నారన్నారు. తగిన బుద్ధి చెప్పేందుకు తెలుగుదేశం నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి.. 14 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడికి జైల్లో కనీస వసతులు కల్పించకుండా జగన్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. బిజెపి మీద చంద్రబాబు అరెస్టు విషయంలో నిందలు ▶ 2లో

బిజెపి, వైసిపి పాలనలో..

విద్యారంగానికి తీరని ద్రోహం

- కేరళ తరహా విద్యావిధానం అమలుచేయాలి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు
- రాష్ట్ర స్థాయి విద్యారంగ సదస్సులో పలు తీర్మానాలు ఆమోదం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు విద్యారంగానికి తీరని ద్రోహం చేశాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'నేటి విద్యా రంగం –ప్రత్యామ్నాయ విధానం' అంశంపై రాష్ట్ర సదస్సు శుక్రవారం జరిగింది. సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉన్నత విద్యలో కోర్సుల మూసివేతతో ప్రభుత్వ విద్యను పేదవారికి దూరం చేస్తోందని, ఈ విధానాల కారణంగా డిగ్రీలో అడ్మిషన్లు తీవ్ర స్థాయిలో పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త విద్యా విధానం అమలు కారణంగా హైస్కూల్ విద్యలో 3, 4, 5 తరగతులు విలీనమయ్యాయన్నారు. ఉన్నత విద్యలో నాలుగేళ్ళ డిగ్రీ, విశ్వవిద్యాలయాలకు నిధుల కోత వంటివి ప్రభుత్వ విద్యలో తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. కేంద్రం నుండి వచ్చిన పాఠ్య పుస్తకాలను భోధిస్తున్నారని, ఈ పాఠాలు వాస్తవ చరిత్రను చెరిపి అవాస్తవాలను భోదిస్తున్నాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ప్రతి నియోజకవర్గంలో ఒకటి ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు డిగ్రీతో పాటు ఉద్యోగ అవకాశాలు పెంపొందించే కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ విధానంతోనే..

ప్రత్యామ్నాయ విధానంతోనే విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ విద్యారంగానికి సంబందించిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రకటిస్తోందన్నారు. ఈ పాటికే సిపిఎం అధికారంలో వున్న కేరళ రాష్ట్రంలో అనుసరించిన విధానం దేశానికి గర్వకారణంగా నిలిచాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినాశక విద్యావిధానం అమలు చేస్తున్నాయని, ఇవి విద్యా రంగానికి హానికరమన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలు మూసివేశారని, పీజీకి ఫీజు రీయంబర్స్‌మెంట్ రద్దు ▶ 2లో

పూర్తయినవి తక్కువ..రద్దయ్యేవి ఎక్కువ..

- జిల్లాలో మంజూరైన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు 1345..
- నిర్మాణాలు మొదలుపెట్టినవి 574..
- కాంట్రాక్టర్లు ముందుకు రాక రద్దయినవి 771..
- పూర్తయినవి 204 మాత్రమే..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావించి మూడేళ్ళ క్రితం మంజూరు చేసిన వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలు నేటికీ అత్యధికం అసంపూర్తిగా నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిపాలన చేరువ చెయ్యాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన రాష్ట ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భారీ ఎత్తున సచివాలయాల వారీగా ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు అప్పట్లో చెప్పడం జరిగింది. దీంతో అత్యధిక శాతం అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతి నిధులు, నేతలు కాంట్రాక్టర్లుగా మారి.. ఈ భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. తమ వద్ద ఉన్న సొమ్ముతో పాటు వడ్డీకి అప్పులు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. కానీ బిల్లుల మంజూరులో విపరీత జాప్యం చోటుచేసుకుంది. రెండేళ్ల పాటు బిల్లులు సక్రమంగా విడుదల చేయని ప్రభుత్వం గత జూలై నెల నుంచి బిల్లులు మంజూరు చేస్తూ వచ్చింది. కానీ ఇప్పటికే సదరు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టిన వారు అప్పులపాలై ఇబ్బందులు పడిన నేపథ్యంలో కాంట్రా క్టర్లు ఎవరూ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రస్తుతం ముందుకు రావడం లేదు. దీంతో ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల పరిస్థితి ఉంది.



కొత్తపేటలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

బాపట్ల జిల్లాలో రూ.149.29 కోట్ల నిధులతో అంచనాలతో 401 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. కానీ ఇందులో 283 భవనాల నిర్మాణాలు మాత్రమే మొదలుపెట్టారు. దీంతో 118 సచివాలయ భవనాలు రద్దుల పద్దులో చేరాయి. మొదలుపెట్టిన 283లో కూడా 115 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి.

రైతు భరోసా కేంద్రాలను రూ.69.53 కోట్ల అంచనాలతో 315 మంజూరు చేశారు. ఇందులో కూడా ప్రారంభం కాని 175 భవనాల నిర్మాణాలు రద్దులో చేరాయి. 140 భవనాలు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. ఇప్పటికి 56 మాత్రమే ▶ 2లో

సచివాలయభవనాలు	రైతుభరోసా కేంద్రాలు	ఆరోగ్య కేంద్ర భవనాలు
మంజూరైనవి- 401	మంజూరు అయినవి -315	మంజూరు అయినవి -343
నిర్మాణాలు ప్రారంభించినవి-283	నిర్మాణాలు ప్రారంభించినవి-140	నిర్మాణాలు ప్రారంభించినవి -151
పూర్తి అయినవి -115	పూర్తయినవి- 56	పూర్తయినవి -33
నిర్మాణాల శాతం- 40.64	నిర్మాణాల శాతం- 40	నిర్మాణాల శాతం - 21.85



మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

ఎగుమతుల కేంద్రంగా బాపట్ల..

- జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం మదన్‌మోహన్‌శెట్టి
- జిల్లా నుంచి ఎగుమతుల ప్రోత్సాహం కోసం కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్రంలోని ప్రతి జిల్లానూ ఒక ఎగుమతుల కేంద్రంగా రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా నుంచి ఎగుమతుల ప్రోత్సాహం కోసం తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎన్.మదన్‌మోహన్‌శెట్టి తెలిపారు. ఎగుమతుల పథకంలో భాగంగా శుక్రవారం బాపట్ల జిల్లా పరిశ్రమల కేంద్రం తరపున జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాల్లో ఈ పథకంపై జిల్లాస్థాయి స్టేక్ హెూల్డర్స్ కన్సల్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం మదన్‌మోహన్‌శెట్టి మాట్లాడుతూ పథకం ముఖ్యఉద్దేశాన్ని వివరించారు. ఎగుమతుల ప్రోత్సాహక పథకం ద్వారా జిల్లాలో ఘనీభవించిన రొయ్యలు(మెరైన్ ప్రొడక్ట్స్), బలవర్ధకమైన బియ్యం(పోర్టిఫైడ్ రైస్) మరియు బియ్యం ప్రొడక్ట్స్, చేనేత ఉత్పత్తులను ఎగుమతుల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎగుమతులు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలను ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా జీవో ఎమ్ఎస్ నెం 24 ద్వారా రిఫర్ వెహికల్స్‌కు రూ.10 లక్షలకు మించకుండా వెహికల్ విలువలో 25 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఎం.ఎస్.ఎం.ఇ లకు ఇచ్చే సబ్సిడీ కి అదనంగా 'జెడ్' స్కీములో 10 శాతం సబ్సిడీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేయిర్స్‌లో పాల్గొంటే గ్రౌండ్ రెంట్‌లో 30 శాతం మొదలైనవి వున్నాయన్నారు. ఈ మూడు ఉత్పత్తుల ఎగుమతులను రానున్న ఐదు సంవత్సరాలలో రెట్టింపు చేసేవిధంగా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రంలోని కామర్స్ మరియు ఎక్స్పోర్ట్స్ కమిషనర్ కార్యాలయం నుండి హాజరైన జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పథకం ముఖ్య ఉద్దేశం మరియు ఈ పథకం జిల్లాలో అమలు చేసే విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వివరంగా తెలియజేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎగుమతుల వివరాలను ▶ 2లో

బిజెపి, వైసిపి పాలనలో.. విద్యారంగానికి తీరని ద్రోహం

(మొదటిపేజీ తరువాయి)

చేశారన్నారు. యూనివర్సిటీల స్థాయిని కిందకు దిగజార్చారని, ప్రైవేట్ యూనివర్సిటీలకు ద్వారాలు తెరిచి విద్యా వ్యాపారం చేస్తున్నారన్నారు.

విద్యావేత్త, మంగమ్మ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఏవి పుల్లారావు మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం పేరుతో తెలుగు మీడియం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. రెండు మీడియాలు సమాంతరంగా కొనసాగించాలని కోరారు. డిగ్రీ కాలేజీలో అన్ని కోర్సులు పెట్టి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, పాటలు, మానసిక ఉల్లాసానికి అవసరమైన కార్యక్రమాలు ఉండాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి తీర్మానాలను ప్రకటించగా పాల్గొన్న ప్రతినిధులు వాటిని ఆమోదించారు.

సదస్సులో సిపిఎం రాష్ట్ర నాయకులు కెప్రసన్న కుమార్, ఎ అశోక్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ పి. శేషయ్య, సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, జిల్లా నాయకులు కంకణాల రమాదేవి, వి.బాలకోటయ్య, బి.రఘురాం, సిహెచ్ వినోద్ పాల్గొన్నారు.

రోడ్డుపై టైర్లు తగలబెట్టి..

(మొదటిపేజీ తరువాయి)

మోపుతున్నారన్నారు. టిడిపికి అండగా ఉన్నారని పవన్‌కళ్యాణ్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు అన్నారు. ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తుండగా పోలీసులు రంగ ప్రవేశం చేసి టిడిపి నాయకులను చెదరగొట్టే ప్రయత్నంలో టిడిపి నాయకులకి, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే స్వామిని సిఐ దాచేపల్లి రంగనాథ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామని అనడంతో ఆయన అడ్డం తిరిగారు. ఆందోళన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎగుమతుల కేంద్రంగా బాపట్ల..

(మొదటిపేజీ తరువాయి)

తెలియపరిచారు. సభకు ఆహ్వానించబడిన వివిధ ఉత్పత్తుల ఎగుమతిదారులతో మాట్లాడుతూ వారి నుంచి వారి ఉత్పత్తుల ఎగుమతులు రాబోయే ఐదు సంవత్సరాలలో రెట్టింపు అవడానికి ఏ చర్యలు ప్రభుత్వం తీసుకుంటే బాగుంటుందో అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాలన్నింటినీ పొందుపరచి జిల్లాకి ఎక్స్పోర్ట్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి రాష్ట్రప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలియజేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్పోర్టర్స్ ఆర్గనైజేషన్ విజయవాడ (ఫియో) నుంచి హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వారి సంస్థ కార్యాలయం విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నదని తెలుపుతూ తమ సంస్థ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను ఆయన వివరించారు. ఉత్పత్తుల ఎగుమతిలో వివిధ దేశాలు అనుసరిస్తున్న విధి విధానాలను వివరిస్తూ ఎగుమతిదారులు వారి వెబ్ పోర్టల్ లో ఉంచిన వివిధ దేశాల ట్రేడ్ అగ్రిమెంట్లను అనుసరించవలసిందిగా కోరారు. ఆక్వా సాగులో యాంత్రీకరణ ఆవశ్యకత, వారు అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకోవడానికి ఈక్వాడోర్ దేశాన్ని సందర్శించాల్సిన అవసరం ఉందని రాయల్ మెరైన్ ప్రతినిధి తెలిపారు. ఈక్వెడార్ దేశం ఆక్వా ఉత్పత్తులను తక్కువ రేటుకు సరఫరా చెయ్యడం వల్ల మన రాష్ట్రం నుండి ఆక్వా ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిందని, కాబట్టి మన రాష్ట్రంలో ఆక్వా రైతులకు ట్రాన్స్ పోర్టేషన్, ఎలక్ట్రి సిటీ ఛార్జీలపై సబ్సిడీ మొదలైనవి ఇచ్చి వారిని ప్రోత్సహిస్తే ఆక్వా రంగం కోలుకొనే అవకాశం వుందన్నారు.

సమావేశంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్, జాతీయ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నగేష్, లేపాక్షి హండీ క్రాఫ్ట్ ప్రతినిధి పి సాంబశివారెడ్డి, రాయల్ మెరైన్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఎస్ స్టాలిన్, సురేంద్రరాజు, మోహిత్ గ్రానైట్స్ అంజిరెడ్డి, శ్రీ మహాలక్ష్మి రైస్ మిల్లు, శ్రీ పద్మాలయ రైస్ మిల్లు, శ్రీనివాస మోడర్న్ రైస్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్తయినవి తక్కువ.. రద్దయ్యేవి ఎక్కువ

(మొదటిపేజీ తరువాయి)

పూర్తయ్యాయి. గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాలు రూ.60.65 కోట్ల అంచనాలతో 343 మంజూ రయ్యాయి. ఇందులో కూడా నేటికి నిర్మాణా లకు నోచుకోని 192 భవనాలు రద్దులో చేరా యి. 151 భవనాల నిర్మాణాలు మొదలు పెట్టారు. ఇందులో 33 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. జిల్లాలో పాల సేకరణ కేంద్ర భవనాలు (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్) రూ.25.80 కోట్ల అంచనాలతో 136 మం జూరు అయినట్లు గతంలో ప్రకటించారు. వీటిలో 44 భవనాల నిర్మాణాలు ప్రభుత్వ నిధు లతో నిర్మించాల్సి ఉండగా మరో 99 భవనా లను అమూల్ సంస్థ నిర్మించాల్సి ఉంది. ప్రస్తు తం ఈ భవనాల నిర్మాణాలు ప్రారంభం అయ్యే పరిస్థితులు లేనందున రద్దు గానే భావించాల్సి ఉంది. జిల్లాలో డిజిటల్ లైబ్రరీల కోసం రూ.23.72 కోట్ల అంచనాలతో 150 భవ నాలు నిర్మించాల్సి ఉంది. కానీ ఈ ఊసే లేకుండా పోయింది. బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలు రద్దుల పద్దులో చేరినట్లుగానే వెల్లడవుతుంది. మొదట్లో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను పూర్తి స్థాయిలో నిర్మించాలని భావించారు. కానీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. జిల్లాస్థాయి సమీక్షల్లో మొదలుకాని భవనాల అంశం సమస్యగా మారడంతో వాటిని లెక్కల్లో నుంచి తీసేసి మొదలు పెట్టిన భవనాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కారణంగా మంజూరు అయిన వాటిలో 771 భవనాలు రద్దు అయినట్లుగా అయింది. ఇప్పటికే ప్రారంభించిన భవనాలను పూర్తిచేయడం కష్టంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రభుత్వ హయాంలో అవి ప్రారంభాలకు నోచుకుంటాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గ్రంథాలయం పున:ప్రారంభం

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లిలో ఉన్న గ్రంథాలయాన్ని శుక్రవారం తెరిచారు. ఎన్నో ఏళ్లుగా మూతపడి పుస్తకాలు శిథిలావస్థకు చేరాయి. శుక్రవారం జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని తిరిగి గ్రంథాలయాన్ని తెరిచారు. ప్రభుత్వ వైద్యశాల సెంటర్‌లో ఉన్న మాదిరెడ్డి కొండారెడ్డి భవనంలోనికి గ్రంథాలయాన్ని మార్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె అహ్మద్‌షరీఫ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండలంలోని పెదరాజుపాలెం గ్రామ పంచాయతీలోని మేడేపల్లి శివరామయ్య తండ్రి కొనయ్య అను వారికి ఆరోగ్యం బాగాలేక శస్త్ర చికిత్స చేశారు. కనిగిరి ఎమ్మెల్యే శ్రీ బుర్రా మధుసూదన్‌యాదవ్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ వచ్చింది. బుర్రా మధుసూధన్ ఆదేశాల మేరకు శుక్రవారం పెదరాజుపాలెం గ్రామంలో మేడేపల్లి శివరామయ్యకు సర్పంచ్ పందిళ్ల నాగమణి యల్లయ్య రూ.లక్ష రూపాయల చెక్‌ను అందజేశారు.

పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుపతలపెట్టిన పాఠశాలల ఆడిట్ కార్యక్రమం వాయిదా వేయాలని ఎపిటిఎఫ్ సిఎస్ పురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ కోరారు. దసరా సెలవుల్లో ఇలాంటి ఆడిట్ కార్యక్రమం వల్ల ఇబ్బందిగా ఉంటుందని వారు తెలిపారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-సిఎస్ పురం

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి తెలిపారు. మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో గుర్తించిన పనులకు తీర్మానం చేసి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని చెప్పారు. కూలీలందరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఆదుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక గుజ్జుల సరళాదేవి భవనంలో దర్శి మండలంలోని లంకోజనపల్లి రోడ్డులో ఆటో యూనియన్ సమావేశం షేక్ బాషా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నూతన కమిటీ అధ్యక్షులుగా మస్తాన్, ఉపాధ్యక్షులుగా పెద్దన్న, కార్యదర్శిగా బాషా, సహాయ కార్యదర్శిగా బండి లాజర్, కోశాధికారిగా చిన్న, మరో ఏడుగురిని ఎన్నుకున్నారు.

దర్శికి చేరిన సాగర్ నీరు

ప్రజాశక్తి-దరిశి

తాగునీటి అవసరాల కోసం ఎన్నెస్పీ సాగర్ జలాలు కెనాల్ ద్వారా శుక్రవారం దరిశికి చేరాయి. ఈ సందర్భంగా ఎన్నెస్పీ డీఈ అక్బర్‌బాషా మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. దరిశి, కనిగిరి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, లక్ష్మీపురం, చందవరం, రామతీర్థం జలాశయాలతో పాటు కొన్ని నోటిఫైడ్ చెరువులకు కూడా నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల పంట పొలాలకు ఎలాంటి అవసరాల కోసం వాడరాదన్నారు. ప్రస్తుతం సాగర్‌లో నీరు లేనందున ఈ ఏడాది పంటలకు సాగు కోసం నీటిని ఇవ్వడం లేదని వారు తెలిపారు. ఆరుతడి పంటలకు కూడా అవకాశం లేదన్నారు. కావున రైతులు గమనించి తాగునీటి అవసరాలు తీర్చేందుకు వదిలిన నీటిని చెరువులకే నింపేందుకు అధికారులు సహకరించాలన్నారు. పది రోజులపాటు రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున పది రోజుల పాటు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

అక్రమ అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి-పొదిలి

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ మార్కాపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో పొదిలి మాజీ జెడ్పిటిసి సభ్యులు కాటూరి వెంకటనారాయణ బాబు ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలోని 1వ వార్డులో శుక్రవారం ఇంటింటికి బాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ బూత్ కన్వీనర్ అరిక రాము, కాటూరి శ్రీను, ఖాదర్‌వలి నాయకత్వంలో ఇంటింటికీ బాబు కరపత్రాలను పంచారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలను వివరిస్తూ ఈ సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ఎర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ శివాలయం చైర్మన్ సమంతపూడి నాగేశ్వరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి యలమంద, జిల్లా కార్యదర్శి పొల్ల నరసింహరావు, జిల్లా మైనార్టీల అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ అధికార ప్రతినిధి షేక్ యాసిన్,ముల్లా జిలాని బాషా, గోపాల్ రెడ్డి, ఇల్లులు, ముని శ్రీను, హజరత్, గుర్రం ప్రసన్న కుమార్ యూత్ నాయకులు, కాలేషా, మాబు, పచ్చా, రబ్బానీ, గౌస్, మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యతో ఉద్యోగ అవకాశాలు

ఐక్యూగురు అధినేత ఈశ్వర్

ప్రజాశక్తి-మార్కాపురం

డిగ్రీ చదివిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఎక్కువగా ప్రవేశిస్తున్నారని, సాఫ్ట్‌వేర్ కాకుండా ఇతర ఉద్యోగాలు కూడా వారికే ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటున్నాయని హైదరాబాద్‌కు ఐక్యూగురు సంస్థ అధినేత యు.ఈశ్వర్ చెప్పారు. వివిధ రకాల జాతీయ, అంతర్జాతీయ సంస్థలు డిగ్రీ విద్యార్థుల కోసం ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ మరియు ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి, రెండవ, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉపాధి రంగ కోర్సులు-ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఈశ్వర్ ఆయన బృందం పాల్గొని విద్యార్థులకు సరైన దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు సి జావా, పైథాన్, డిజిటల్ మార్కెటింగ్ లాంటి ప్రత్యేకమైన కోర్సులను అభ్యసిస్తే ఉన్నత స్థాయి ఉపాధి దొరుకుతుందనే అపోహలో ఉన్నారని... కేవలం డిగ్రీ చదువును సరిగ్గా విశ్లేషణాత్మకంగా చదివి సంభాషణా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే పెద్ద పెద్ద అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కేవలం కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థులే కాకుండా బయాలజీ విద్యార్థులు మెడికల్ కోడింగ్ ద్వారా, కామర్స్, స్టాటిస్టిక్స్ విద్యార్థులు సాప్, సాస్‌ల ద్వారా, మ్యాథమాటిక్స్ విద్యార్థులు అన్ని రకాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా ఉన్నత ఉపాధి సొంతం చేసుకోవచ్చన్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి నగరాల్లో మాత్రమే నేర్చుకునే కోర్సులను ఇన్నర్ షిప్ ప్రోగ్రాం ద్వారా డిగ్రీ విద్యార్థులకు నామ మాత్రపు ఫీజులతో ఐక్యూగురు సంస్థ అందిస్తుందని వివరించారు. విద్యార్థులే కుండా ప్రైవేటు విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులు కూడా ఈ తరహా కోర్సులను నేర్చుకుని వారి భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారన్నారు. సంస్థ రిలేషన్‌షిప్ మేనేజర్ యు.శ్రీనివాస్ మాట్లాడుతూ బయాలజీ విద్యార్థులు మెడికల్ కోడింగ్ వైపు దృష్టి సారించాలన్నారు. రాబోవు రోజుల్లో సమాజంలో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరికీ తప్పనిసరి అవుతుందన్నారు, ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, క్యాంపస్ అండ్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె.పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్‌కుమార్, కళాశాల ఇన్‌ఛార్జి డాక్టర్ ప్రసాద్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శేషుకుమార్, కంప్యూటర్ సైన్స్ ఉపన్యాసకులు రాఘవేంద్ర, సీనియర్ అధ్యాపకుడు జి.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈశ్వర్

అదుపుతప్పి ఆటో బోల్తా..

- మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పర్చూరు


మృతిచెందిన అనురాధ

ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలు య్యాయి. ఈ ఘటన పర్చూరు సమీపంలో చీరాల రోడ్డులో నున్న పాలిటెక్నిక్ కళాశాల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చిలకలూరిపేట మండలం, మురికిపూడి గ్రామానికి చెందిన ఏడు మంది మహిళలు చీరాలలోని అమ్మవారి దేవాలయంలో ప్రార్థనల కోసం ఆటోలో బయలు దేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి అక్కడ రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉంది. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అనురాధ (35) అనే మహిళ తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఐదు సంవత్సరాల పాప, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అం దుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాలకు తరలించారు. గతంలోనూ ఇదే ప్రదేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. ఆ ఘటన మరువక ముందే ఇప్పుడు మరో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు ఎత్తు పల్లాలను సరిచేయించాలని ఆర్అండ్‌బి అధికారులు అనేక సార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.


మాట్లాడుతున్న మాజీ ముత్తుముల అశోక్‌రెడ్డి

చంద్రబాబు ఆరోగ్యం పట్ల

నిర్లక్ష్యం తగదు : ముత్తుముల

ప్రజాశక్తి - గిద్దలూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అందుకు సిఎం జగన్మోహన్ రెడ్డే బాధ్యత వహించాలని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, జెడ్ కేటగిరి భద్రత ఉన్న చంద్రబాబు ఆరోగ్యం పట్ల రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసి కూడా జైలు అధికారులు వైద్యాధికారులకు సమాచారం అందించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, టిడిపి పార్లమెంట్ నాయకులు గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, యామా సంజయ్, నల్లబోతుల శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ శానేశావలి, రాచర్ల మండల అధ్యక్షుడు కటికే యోగానంద్, ముండ్లపాడు సర్పంచ్ కడియం శేషగిరి, 7వ వార్డు నాయకుడు బి. రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

మానసిక వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న వైద్యులు

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శుక్రవారం మానసిక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాల జిస్టు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ మానసిక దినోత్సవం గురించి అవగాహన కల్పించారు. ప్రజల్లో మానసిక ఆరోగ్యానికై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ వైద్యానికై ఆన్‌లైన్‌లో టెలి మానస్ నెంబర్ 14416 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు ఏడుకొండలు, కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచి మృతికి మంత్రి సంతాపం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండల పరిధిలోని మల్లాపాలెం సర్పంచి మంగినపల్లి సుబ్బయ్య మతి పట్ల రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్పంచి అకాల మరణం పట్ల మంత్రి శుక్రవారం సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుబ్బయ్య మతి దురదష్టకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులు మనోధైర్యం ఉండాలని మంత్రి కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పోలెబోయిన నందిని అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్ తెలిపారు. చీకుమర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన జిల్లా స్థాయి బేస్ బాల్ సెలక్షన్స్‌లో నందిని ప్రతిభ జిల్లాకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నందిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తొమ్మిది మందికి ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దీంతో పూట గడవకా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకులు దుకాణాల్లో అప్పు ఇవ్వడం లేదని చెప్పారు. వెంటనే వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి బాలు నాయక్‌ను వివరణ కోరగా త్వరలోనే వేతనాలు చెల్లిస్తామని ఆయన తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల


ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. నల్ల రిబ్బన్లు కట్టుకొని టిడిపి కార్యాలయం నుంచి నటరాజ్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, అంబటి వీరారెడ్డి, సుబ్బరత్నం, నాదేండ్ల సత్య నారాయణ, లాయర్ కాశయ్య, దొడ్డా శేషాద్రి, నాగేంద్రబాబు, రఫి, ఖాన్, బాషా, శ్రీనివాస్ యాదవ్, రమణారెడ్డి, శ్రీనివాసులు, సమద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

తర్లుపాడు : మండల పరిధిలోని కేతగుడిపి గ్రామంలో వెలసియున్న శ్రీగంగా పార్వతి సమేత శ్రీకేదారేశ్వర స్వామిని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కెపి.కొండారెడ్డి, ఆయన సతీమణి సుబ్బమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి దంపతులు, యువ నాయకులు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, నిర్వహించారు.

ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక ప్రార్థనలు

గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని నాయక్ వీధిలో రావి చెట్టు వద్ద వెలసిన శ్రీశ్రీశ్రీ అల్అజ్ సయ్యదినా ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వామి దర్గా 19వ ఉరుసు మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అల్అజ్ సయ్యదినా ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ స్వామిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అన్నాను సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

తర్లుపాడు: తర్లుపాడు మండలం కేతగుడిపి సచివాలయ పరిధిలోని బుడ్డపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫెక్ట్ సంస్థ, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో శువక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచి డి. పెద్దమస్తాన్ ప్రారంభించారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ పశు పోషకులు ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్య అధికారి డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ పశువులకు, గొర్రెలకు, మేకలకు, ఆవులకు, గేదెలకు సంక్రమించే వ్యాధుల గురించి, వాటి నివారణ గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గేదెలకు, ఆవులకు టీకాలు వేసి, జీర్ణకోశ వ్యాధుల సంక్రమించకుండా నట్టలు ముందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎహెచ్ఎ భార్గవి, ఎఫెక్ట్ సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నిబంధనల ప్రకారం సెలవులు

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెలవులు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ రేపు రెండో శనివారం, తర్వాత ఆదివారం అక్టోబర్ 15 నుండి 25 వరకు దసరా సెలవులని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు యధావిధిగా తరగతులకు హాజరు కావాల్సిందేనని ప్రకటించారని పేర్కొనారు. ప్రభుత్వ సెలవులు కూడా ఇవ్వకుండా ర్యాంకుల కోసం మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా అనేక దఫాలు ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పుడు అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో సెలవు రోజుల్లో తరగతులు నడిపే విద్యాసంస్థలు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు : దసరా సెలవులు ఈనెల 14నుంచి 24వరకు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సెలవుల్లో ఎవరైనా పాఠశాల నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కారంచేడు, పర్చూరు మండలాల ఎంఇఒ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా ఎటువంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న కరణం వెంకటేష్

క్రీడలతో దృఢత్వం: కరణం

ప్రజశక్తి - చీరాల

క్రీడలు యువత ఆరోగ్యానికి, శరీర దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పుట్ బాల్ టోర్నమెంట్ చీరాల పుడ్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ ఆటలు 15వరకు జరుగ నున్నాయి. కౌన్సిలర్ గొట్టిపాటి ఎబినేజర్ పర్యవేక్షణలో జరిగిన క్రీడా పోటీలకు ఆయన హాజరయ్యారు. క్రీడాలలో గెలుపు ఓటమిలు ముఖ్యం కాదని అన్నారు. ఆటలు ఐక్యతను పెంచుతాయని అన్నారు. గొట్టిపాటి భాగ్యరాజు, కంకణాల టామ్ ఆర్గనైజ్ చేశారు. 12టీంలు పాల్గొనగా మొదటి బహుమతి రు.50వేలు, 2వ బహుమతి రు.30వేలు, 3వ బహుమతి రు.20వేలు విజేతలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సిల్వాన్ రాజ్, మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, నెస్సి, యాతం మేరీబాబు, కోడూరి ప్రసాదరెడ్డి, డొక్కా ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా 'మేరా మట్టి..'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమృత కలశ ర్యాలీని చేశారు. ఎంపిడిఒ గుమ్మా చంద్రశేఖర అధ్యక్షత వహించారు. ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడుతూ మేరా మట్టి మేర దేశ్ కార్యక్రమానికి 15పంచాయతీల నుండి మట్టిని, ధాన్యాన్ని సేకరించి ఒకటిగా చేసి ముగ్గురు ప్రతినిధుల ద్వారా కేంద్రానికి పంపడం జరుగుతుందన్నారు. జడ్పిటిసి ఉదయ భాస్కరి, ఉపాధ్యక్షులు కె పిచ్చయ్య శాస్త్రి, ఎంపిటిసిలు శ్రీనివాస రావు, రావు రాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు సలీం, వైసీపీ కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, పిఏసిఆర్డి ఊహరాణి, ఎఒ జలజ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

◆ 83 డ్వాక్రా సంఘాలకు రూ.15.61కోట్ల రుణ మాఫీ ◆ పొదుపు సంఘాల మహిళలతో ఎంఎల్ఎ కోన రఘుపతి

ప్రజాశక్తి - కర్లపాలెం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కొకొని ఆర్థిక స్వావలంభన దిశలో పయనింపచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో మహిళా స్వావ లంభనకు జగనన్నవరాలజల్లు కార్యక్రామంలో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో యునియన్ బ్యాంకు, సిజిజిబి, ఇండియన్ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాఆడారు. మహిళలు సుస్థిర ఆదాయంతో కుటుంబాల్లో వెలుగులు రావాలని అన్నారు. వ్యాపార, జీవనోపాధి అవకాశాలకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని అన్నారు. మహిళలు లక్షాధికారులు కావాలనే లక్ష్యంతో పథకాలన్నీ మహిళల పేరుతోనే అమలు చేస్తూ సిఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారని అన్నారు. పొదుపు సంఘాల మహిళల బాధలు సిఎం జగన్ పాదయాత్రలో కళ్లారా చూశారని అన్నారు. చలించిపోయి నాలుగు దఫాల్లో



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ కోన రఘుపతి

పొదుపు సంఘాల కాతాల్లో రుణం జమ చేస్తున్నట్లు చెప్పారు. మండలానికి వైఎస్ఆర్ ఆసరా ద్వారా రూ.39 కోట్లు కర్లపాలెం మండలానికి వచ్చినట్లు తెలిపారు. మహిళ లను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటం కోసం ఋణ పరిమితి రూ.10లక్షలు నుండి రూ.20లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం అమూల్, హిందూ స్తాన్ యూని లివర్, ఐటిసి, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్, అలన వంటి వ్యాపార దిగ్గజాలతో, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. రెండో ఏడాది అజియో రిలయన్స్, గ్రామీణ వికాసకేంద్రం, టేనేజర్, మహేంద్ర, ఖేతి వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని వ్యాపార మార్గాలు చూపించినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు ద్వారా 83సంఘాలకు 830మంది సభ్యులకు రూ.13.81 కోట్లను వన్ క్లిక్ వన్ చెక్ ద్వారా, స్త్రినిది 210సభ్యులకు రూ.1.66కోట్లు, సిఐఎఫ్ ద్వారా 12 సంఘాకు రూ.14.5 లక్షలు కలిపి మొత్తము రూ.15.61కోట్ల రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమం లో బ్యాంకు మేనేజర్లు మురళి, శైలేష్ భగత్, రత్నజ్యోతి, సర్పంచ్ నక్క లలితకుమారి, జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ డి సీతారామిరెడ్డి, వైసిపి కన్వీనర్ ఎల్లావుల ఏడుకొండలు, ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఎంపిటిటి తాండ్ర సాంబశివరావు, ఆసిఫ్ ఆలీ, సర్పంచులు దేవరకొండ అంకమ్మ, మల్లెల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు పరమానంద కుమార్, యాజలి వైసిపి ఇన్చార్జి పేరాల వెంకట సురేష్, సచివాలయ కన్వినర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతికి పాల్పడ్డ దోషులను శిక్షించాలి

ప్రజాశక్తి - రేపల్లె

మెప్మాలో రూ.కోటికిపైగా అవినీతికి పాల్పడిన దోషులను మెప్మా జిల్లా స్థాయి అధికారులు రక్షించటం సిగ్గుచేటని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యలయం కొరటాల మీటింగ్ హాల్లో మోసపోయిన డ్వాక్రా మహిళలు సమావేశం ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గత రెండు నెలల నుంచి అనేక రూపాలలో ఆందోళన చేయటంతో తప్పని పరిస్థితుల్లో జిల్లా అధికారులు, మెప్మా పీడీ డిపార్ట్మెంట్ విచారణ చేశారని అన్నారు. అవినీతికి పాల్పడిన వారిని సస్పెండ్ చేస్తామని హామీలు ఇచ్చారని అన్నారు. అయితే వాస్తవాలు కనీసం పోలీస్ స్టేషన్లో కూడా చెప్పాకుండా ఎవరైతే అవినీతికి పాల్పడ్డారో వారికి అండగా ఉంటూ మెప్మా జిల్లా పీడీ, స్థానిక మెప్మా అధికారులు అవినీతిని గోప్యంగా ఉంచుతూ కొంత సమాచారం మాత్రమే పోలీసు



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత మణిలాల్

స్టేషనలో ఇచ్చినట్లు ఆరోపించారు. మెప్మా పీడీ పేద మహిళలకి ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అవినీతికి కారణమైన మెప్మా అధికారులను, అప్పటి సిఓలు, సిఎంఎంలను సస్పెండ్ చేస్తామని, మోసపోయిన మహిళలకు బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా డ్వాక్రా గ్రూపుల్లో కొనసాగిస్తామని, అవినీతి జరిగిన నేపథ్యంలో పేద డ్వాక్రా మహిళలకు బ్యాంకర్స్ నుంచి ఒత్తిడి లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మోసపోయిన డ్వాక్రా మహిళల కుటుంబాల్లో బ్యాంకుల నుండి ఒత్తిడి రావడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు శరణ్యం అంటూ వాపోతున్నారని అన్నారు. అయినా కనీసం మానవత్వంతో కూడా మెప్మా అధికారులు స్పందించడంలేదన్నారు. కాలం గడుపుతు మోసం చేసిన వారికే మద్దతుగా ఉన్నారని ఆరోపించారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పిర్యాదు చేస్తే పరిష్కా రమైనట్లు సంతకాలు చేయాలని మెప్మా అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని మహిళలను కాపాడే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి షేక్ ఆశ, ఉపాధ్యక్షులు కె నాంచారమ్మ, షబానా సుల్తానా, మోసపోయిన డ్వాక్రా మహిళలు, సీపీఎం నాయకులు కెవి లక్ష్మణరావు, కె ఆశ్విరాధం పాల్గొన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

ప్రజశక్తి - చీరాల

జగనన్న శాశ్వత భూహక్కు రీ సర్వేను వేగవంతం చేయాలని సిడిఎంఎ పి కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం రీ సర్వేపై టౌన్ ప్లానింగ్ అధికారులు, వీఆర్వోలతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడత జగనన్న భూహక్కురి సర్వే 24మున్సిపాలిటీలో జరుగుతుందని తెలిపారు. అందులో చీరాల కూడా ఉందన్నారు. గతంలో రీ సర్వే పల్లెల్లో జరిగిందని తెలిపారు. తొలి విడత రీ సర్వే పూర్తియిన వెంటనే డిసెంబర్ 23న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా భూ హక్కుదారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తామన్నారు. అనంతరం వైసిపి ఇన్చార్జి కర్ణం వెంకటేష్ మాట్లాడుతూ రీ సర్వేను పకడ్బందీగా చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర రీ సర్వే ఆఫీసర్, మాజీ ఐఏఎస్ అధికారి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిఎంఎ

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సిఎం వైఎస్ జగన్‌దేనని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మండలంలోని పందేలపల్లి పంచాయతీ పాతూరులో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండలం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, ఆసాధి అంకాలరెడ్డి, పల్లపోలు శ్రీనివాసరావు, కావూరి రమణరెడ్డి, లేళ్ల శ్రీధర్, బుర్ల సాంబశివరావు, రొండా భరత్, ఆవుల అశోక్, సాధు రాఘవ, పృధ్వీ చంద్ర మోహన్, చెరుకూరి బల్నాయుడు, పిట్టు హనుమంతురెడ్డి, గుత్తి మలయ్య, సజ్జ చంద్రశేఖర్, దంతం మంతు, కట్టా జార్జ్ స్యామేల్, కంచి సాంబిరెడ్డి, పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బట్ట కోటేశ్వరరావు, అజిజ్జుల్లా, నంగు ప్రభాకరరెడ్డి, యారసు శ్యామ్, నంగు రామిరెడ్డి, మదుల్లూరి సీత మహాలక్ష్మి, వేటగిరి సంజీవరావు, కజ్జీ, బుర్ల శివ, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం ఐలవరంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నాను ద్దేశించి సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మర్రివాడ వెంకట్రావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసి బడా కంపెనీలకు లాభం చేకూరే విధంగా ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహ వ్యక్తం చేశారు. 200యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచితంగా ఇస్తామని ప్రకటన చేసిన వైసిపి ప్రభుత్వం ఎందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేంతవరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దీపాల సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, దండు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అమీర్, జె కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసనగా ధర్నా

సాగునీళ్లివ్వకుంటే రైతు ఉద్యమం తప్పదు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్రంలో రైతులు అనేక కష్ట నష్టాల మధ్య వ్యవసాయం చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కందిమళ్ల రామకోటేశ్వరరావు అన్నారు. రైతు సంఘం ప్రాంతీయ కమిటీ సమావేశం అధ్యక్ష, కార్యదర్శులు పాలేపు సాంబయ్య, వీరవల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు మాట్లాడారు. హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు రైతుసంఘం నాయకులు నివాళులు అర్పించారు. ప్రభుత్వం నుండి రైతులకు కనీస మద్దతు ధర అందించడంలో అయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం రామకోటేశ్వరావు మాట్లాడుతూ అకాల వర్షాలు, తుఫాన్లతో రైతులు పండించిన పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రైతులు నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలోని రాజుగారిపాలెం, ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాల్లోని పొలాల్లో రైతులు అమర్చుకున్న విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, పేర్ని నాగేశ్వరరావు, మోహనరావు, శేషాద్రి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదు

ప్రజాశక్తి-కొండపి

ప్రజలకు మేలు చేస్తామని నమ్మించి ఓట్లేయించుకుని మోసం చేసి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని కొండపి యువత నాయకులు దేపూరి మస్తాన్ అన్నారు. శుక్రవారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు మద్దతుగా 'బాబుతో నేను' కార్యక్రమాన్ని కొండపి ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య ఆదేశాల మేరకు కొండపి గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ద్రోహాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కడియం సుబ్రమణ్యం, ఇజ్రాయిల్, హనుమంతరావు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

విద్యుత్ భారాలు తగ్గించకుంటే ఉద్యమం

వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్

ప్రజాశక్తి-టంగుటూరు

పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించకుంటే భవిష్యత్తులో ప్రజలే రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేసే పరిస్థితి వస్తుందని వామపక్షాల నాయకులు ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస థియేటర్ సెంటర్‌లో కరెంటు ఛార్జీల పెంపుపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 148 మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనగా 146 మంది కరెంటు ఛార్జీలను వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. ఈ ఓటింగ్ సరళిని బట్టి చూస్తే కరెంటు చార్జీల పెంపు ప్రభావం ప్రజల్లో తీవ్రంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక నిరుపేద సామాన్యుడి ఇంటికి గతంలో రూ.150 నుండి 200 రూపాయలు మాత్రమే నెల కరెంట్ బిల్లు వస్తుండగా ప్రస్తుతం అది రూ500కి పెరిగిందని చెప్పారు. కొందరు ఓటర్లు నేరుగా ప్రభుత్వంపైనే తీవ్రంగా విమర్శలు చేయడాన్ని బట్టి చూస్తే కరెంట్ చార్జీల పెంపు భారం సామాన్య ప్రజలలో ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. ట్రూ అప్ చార్జీలు, సర్ ఛార్జి, కస్టమర్, సర్వీస్ తదితర చార్జీల పేరుతో కరెంటు బిల్లులు ఇవ్వడం పట్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2013వ సంవత్సరం నాటి ఎవరివో బకాయిలు తమ బిల్లులలో వేసి వసూలు చేయడం ఏమిటని ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలను నిలువు దోపిడీ చేసేలా కరెంటు చార్జీలు పరిణమించాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ వేశపోగు మోజెస్, నాయకులు టంగుటూరి రాము, టి నారాయణరావు, కొల్లాబత్తిన శ్రీనివాస్ టి ప్రభాకర్, జి ప్రసాద్, న్యూ డెమోక్రసీ నాయకులు ఎం నాగరాజు, ఎంఎల్ పార్టీ నాయకులు పి.కోటేశ్వరరావు, జి.వెంకట్రావు, నాయకులు సిసింద్రీ, వెంకట్రావు, పాల్గొన్నారు.



ప్రజాబ్యాలెట్‌లో ఓటు వేస్తున్న మహిళ

గిరి ప్రదర్శనకు ఆర్టీసీ బస్సులు వినియోగించుకోండి

చైర్మన్ బత్తుల సుప్రజ


ప్రజాశక్తి-శింగరాయకొండ

పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదర్శన కోసం ఈ నెల 27న సాయంత్రం ఎనిమిది గంటలకు కందుకూరు నుండి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజ అన్నారు. టికెట్ ఒకరికి భోజనంతో కలుపుకొని రూ.2600 అని తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి, తిరుత్తని మొదలగు పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. వివరాలకు డిపో మేనేజర్, కందుకూరు సెల్ నెం.9959225698, మార్కెటింగ్ కో ఆర్డినేటర్ సెల్ నెం.7382889870ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నారా రామారావు, హరిత దంపతుల కుమార్తె శతి జన్మదిన వేడుకలను ఒంగోలు నగర పరిధిలోని తుఫాన్ నగర్ ఎస్‌టి కాలనీ పాఠశాలలో విద్యార్థులు మధ్య శుక్రవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి శతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఎంఆర్ పౌండేషన్ అధినేత మక్కెన థామస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లులను అందజేశారు. ఎంఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వక్తలు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులోని ద్వారకానగర్, శ్రీరామ్ కాలనీ, పీర్లమన్యం, సమతానగర్, ఆంధ్రకేసరినగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోపాల్‌నగర్ అన్ని లైన్లు, గోపాల్ నగర్ ఎక్స్టెన్షన్ లైన్ ఎక్స్టెన్షన్ అన్ని లైన్లు.. తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఒంగోలు టౌన్ డిఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

ఆ నాణేలు చెల్లుబాటు కావట్లేదు..

ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు

ప్రజాశక్తి-ఒంగోలు

దేశవ్యాప్తంగా ఆర్‌బిఐ విడుదల చేసిన రూ.10, రూ.20 నాణేలు బయట చెల్లుబాటు కావడం లేదని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాణేతలు విడుదల చేసింది చాల సంవత్సరాల క్రితం అయితే ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ 19 వచ్చిన సందర్భంగా మన రాష్ట్రంలో కూడా వైరస్ వచ్చినప్పుడు చిల్లర నాణేలు ముట్టుకొంటే కొవిడ్ వస్తుంది అని ప్రచారం చేయడం వల్ల వ్యాపారం చేసే వారి దగ్గర నాణేలు ఉండిపోయాయన్నారు. ఈ మధ్య కాలంలో అన్ని బ్యాంకుల్లో రూ.10, రూ.20 నోట్లు ఆపివేయడం జరిగిందని, 10, 20 నాణేలు మాత్రమే ఇస్తున్నారని, వ్యాపారం చేసే వారు మాత్రం కస్టమర్లకు నోట్లు బదులు నాణేలు ఇస్తుంటే ఎవరూ తీసుకోవడం లేదన్నారు. దీని వల్ల వ్యాపారస్తులు చాల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజల్లో అపోహలు తొలగించాల్సిన బాధ్యత ఆర్‌బిఐ, బ్యాంకుల యాజమాన్యం తీసుకోవాలని కోరారు.




కొల్లా మధు

14, 15 తేదీల్లో మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 14, 15 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 14న సాయంత్రం 5.30 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6.30 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రి 7 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఈ నెల 15న ఉదయం 8 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒంగోలు రాంనగర్ 2 వ లైనులో మాగుంట కార్యాలయంలో మాగుంట అభిమానులు ఆధ్వర్యంలో నిర్వహించు జన్మదిన వేడుకలలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ చైతన్య

'చైతన్య'లో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-ఒంగోలు

స్థానిక సుందరయ్యభవన్‌లోని చైతన్య స్కిల్ క్లినిక్‌లో హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురు, శుక్రవారాల్లో ఉచితంగా ఓపీ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ చర్మవ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఈ రెండు రోజుల్లో 80 మందికి ఉచితంగా ఓపీ వైద్యసేవలు అందించామన్నారు. 20 మందికి హెయిర్ స్కాన్‌ను ఉచితంగా చేశామన్నారు. 30 మందికి అవసరమైన రక్తపరీక్షలను రాయితీతో చేసినట్లు తెలిపారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లోనూ ఉచిత క్యాంపులు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం పాదర్తి కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పలు రకాల ఆటల్లో ఎంపిక అవ్వడం జరిగిందని స్కూల్ ప్రిన్సిపాల్ వి అరుణ కుమారి తెలియజేశారు .చదరంగం పోటీల్లో అండర్ 14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న కే. కిరణ్మయి అండర్ 17 విభాగంలో 10వ తరగతి చదువుతున్న వి. మీనాక్షి 9వ తరగతి చదువుతున్న పి.సంకీర్తన ఎంపికయ్యారు. అలాగే కబడ్డీ పోటీలలో అండర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కే మానస ఎనిమిదో తరగతి విద్యార్థిని డి తేజస్వి అండర్ 17 విభాగంలో 10వ తరగతి చదువుతున్న మీనాక్షి ఎంపిక అయ్యారు ఎంపికయ్యారని తెలియజేశారు. విద్యతో పాటు క్రీడారంగంలో కూడా ముందుండాలని ఆమె తెలియజేశారు. క్రీడలు మానసిక దఢత్వాన్ని ఉంచుతాయని తెలియజేశారు. ఈ ఆటల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి

ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండల పరిధిలోని దొడ్డవరంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని ప్రారంభించి ఐసిడిఎస్ స్టాల్స్‌ను పరిశీలించి వారు చేసిన వంటకాలను తిని సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఏ విధంగా అద్దుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సొంత గ్రామంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ఇంటింటా సర్వే జరిపి రోగులను గుర్తించి.. వారికి ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందుల అందజేసి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా చేయటమే ఈ పథకం ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్ ఎన్ మూర్తి, జగనన్న సురక్ష జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి క్యాంపును సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు, జేసిఎఫ్ మండల కన్వీనర్ బత్తుల శీను, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బెజవాడ రాము, గుడ్డ పాతుల రవి, మాజీ ఎంపీటీసీ ఉన్నం ప్రసీద, సర్పంచ్ సుబ్బారావు, ఎంపీటీసీ పద్మ మోరబోయిన సంజీవరావు, తెర్ల పుల్లారావు, వైద్య సిబ్బంది, రమేష్ పాల్గొన్నారు.



వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టిజెఆర్

కొండపి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటింటికీ వైద్యసేవలు అందుతున్నాయని గుర్రపడియ సర్పంచ్ ఆళ్ల సుజాత శ్రీనివాసులరెడ్డి, మూగచింతల సర్పంచ్ పోకూరి సూర్యనారాయణ, గ్రామ నాయకులు బచ్చల కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నాడు మండలంలోని మూగచింత సచివాలయం పరిదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాంపులో 342 మందికి వైద్యం అందించి.. మందులు అందజేశారు. కార్యక్రమంలో పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ఐ.ప్రియాంక, డాక్టర్ లీనారిఫైల్, సిహెచ్‌సి కొండపి, ఒంగోలు స్పెషలిస్టు డాక్టర్లు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ దివ్యశ్రీ పాల్గొన్నారు.

బెట్ట పరిస్థితులలో

పొగాకు వేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్

ప్రజాశక్తి-కొండపి

వాతావరణంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల పొగాకు సాగు ఇంతవరకు మొదలు కాలేదని, ఉష్ణోగ్రతలు కూడా 35 నుంచి 38 డిగ్రీలు ఉన్నాయి కాబట్టి ఇటువంటి బెట్ట పరిస్థితులలో పొగాకు వేసేవారు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే విషయంలో తగు సూచనలు ఇవ్వడం జరిగిందని వేలం నిర్వహణాదికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పొగాకు బోర్డు పరిదిలోని చోడవరం గ్రామంలో ఉన్న పొగాకు నారు నర్సరీ నిర్వహణ, ఎరువులు నిర్వహణ, సమగ్రసస్య రక్షణ మరియు నీటిపారుదల నిర్వహణపై నర్సరీ శిక్షణా కార్యక్రమం నిర్వహంచారు. ఈ శిక్షణలో రైతులకు, నర్సరీ పెంపకందారులకు వివిధ తెగుళ్ల మరియు వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన నియంత్రణ చర్యలు, నర్సరీలో కలుపు నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యులు బొడ్డపాటి బ్రహ్మయ్య, ఐటిసి లిమిటెడ్ శాస్త్రవేత్త పి.వెంకటేశ్వరరావు, ఐటిసి సిడియం వెంకటరావు, పిఎస్ఎస్‌హెచ్ సిడియం ఎ.రామంజనేయులు, జిపిఐ ఉన్నం శ్రీను, సీనియర్ గ్రేడింగ్ అదికారి టి.సాయికుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీల్‌కుమార్



ప్రకృతి వ్యవసాయంపై వివరిస్తున్న ఎఒ వినయ్‌కుమార్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి పి వినయ్ కుమార్ అన్నారు. మండలంలోని వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఇప్పుడు పండిస్తున్న పంటలు రసాయనాలతో పండించినవని అన్నారు. అవి తినడం వల్ల వ్యాధులు కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. పకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలకు అతివృష్టి, అనావృష్టిని తట్టుకోవడమే కాకుండా భూమిలో జీవ జీవవైవిద్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఇవి తినడం ద్వారా అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని అన్నారు. వచ్చిన సమస్యలను అధిగమించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం త్యాగరాజు, సిసిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.



జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి కిరణ్‌బాబు

యూనివర్సల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

జాతీయ స్థాయి వాలిబాల్ పోటీలకు మండలంలోని పూసపాడు యూనివర్సల్ విద్యార్థి పామంజి కిరణ్‌బాబు ఎంపికయ్యాడు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన అండర్ 17 విభాగంలో వాలి బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 31నుండి నవంబర్ 4వరకు జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి కిరణ్‌ను పాఠశాల డైరెక్టర్ పేర్ని రాధాకృష్ణమూర్తి (ఆర్‌కె) మాస్టారు, కరస్పాండెంట్ పేర్ని సతీష్‌చంద్ర అభినందించారు.



ఎస్ఎంసి సమావేశంలో హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అసైన్మెంట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు తల్లిదండ్రులకు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బార్లపూడి ప్రభాకరరావు, పర్వత నేని పావని, భవనం శివలీల, పెండ్యాల పావని, బండారు అనిల్ కుమార్, అంబటి సురేష్, వసంత రఘుబాబు, సిహెచ్ శ్రీవిద్యలక్ష్మి, పెండ్యాల రాధిక, గోబిదేశి ఆదినారాయణ, వరికొల్లు బ్రహ్మయ్య, గోరంట్ల సంధ్యారాణి, అంబటి అపర్ణ, కంబాలపాటి నరసయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి : వాసవినగర్ 11కెవి ఫీడరు నందు పరివర్తకంలకు మరమ్మత్తులు చేసేందుకు నేడు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎడిఇ టి సత్యనారాయణ తెలిపారు. అద్దంకి తూర్పు భాగమైన గరటయ్య కాలనీ, అభ్యుదయ నగర్, మౌలా నగర్, ఎస్‌బిఐ కాలనీ, నాగులపాడు రోడ్డు ప్రాంతాలకు సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



చెరుకూరులో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం పరిధిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో చెరుకూరు సర్పంచ్ పేరం సుబ్బారావు, కొత్తపాలెం సర్పంచ్ పాలపర్తి సంపూర్ణమ్మ, మండల ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు, చెరుకూరు పిహెచ్‌సి అధికారి మైత్రి, ఎముకుల డాక్టర్ విశాల్, స్త్రీల వైద్య నిపుణులు, చిన్న పిల్లల డాక్టర్ శ్రీనిత్య, కంటి వైద్యులు కరీం బాబు, జనరల్ డాక్టర్ గౌతమ్, ఆరోగ్య సిబ్బంది సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు0 బూసిరెడ్డి, కాలేషా పాల్గొన్నారు. 372మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చిన్నగంజాం : ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశం జిల్లా జడ్పి డిప్యూటీ సీఈఒ హనుమంతరావు అన్నారు. మండలంలోని పెదగంజం పంచాయతీ పాతఆవులదొడ్డి, గొల్లపాలెం నందు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పది మంది వృద్ధులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఒ కె స్వరూపారాణి, ఈఓఆర్డి వివిఎస్ఎస్కె మూర్తి, పంచాయతీ కార్యదర్శి భారతి, సర్పంచ్ నక్కల కృష్ణ, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ కోరారు. స్థానిక జెడ్‌పి హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కరించేలా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందుతున్నారని అన్నారు. 398మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ బాబుల్లా, వైసిపి మండల అధ్యక్షుడు బండారు ప్రభాకరరావు, ఎంపీపీ బండారు అనూష రాజ్ కుమార్, జెసిఎస్ కన్వీనర్ షేక్ షంషుద్దీన్, సర్పంచ్ ఏజర్ల ప్రసన్నా సైమన్ బాబు, ఎంపీటీసీ రావి పేరయ్య, అడపా సుధాకర్ రెడ్డి, ఉప్పలపాటి ధనుంజయ్ రాజు, షేక్ ఉస్మాన్, షేక్ మస్తాన్ వలి, సయ్యద్ సలీం, షేక్ షమీమ్, వార్డు మెంబర్ షేక్ మాలిక్, ఆలపాటి నాని, మోహనరావు, జెట్టి శంకర్, అట్లూరి ప్రభుదాస్, బండారు ప్రసంగి , పల్లె పోగు ప్రసాదు, నలతోటి సునీల్ బాబు, బండ్ల గోపాలస్వామి, చల్లపల్లి గోపాలస్వామి పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్

వేటపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో వృద్ధులకు వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు చేతుల మీదుగా కళ్ళజోళ్ళు శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని అక్కాయపాలెంలో జెడ్‌పి హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎంపిడిఒ రుతమ్మ, సూపరింటిండెట్ ఎంవిఎస్ శర్మ, యుడిసి జయరాజ్, ఎఒ ఐ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి పరణం పూర్ణ కుమారి, పందలపల్లి పిహెచ్సి డాక్టర్ జయ కుమార్, వైసీపీ మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జేఏసీ కన్వీనర్ లీల శ్రీధర్, దంతం హనుమంతరావు పాల్గొన్నారు.

కారంచేడు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని ఎంపిడిఒ డి విజయలక్ష్మి అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కెవి రామారావు, ఎంపీటీసీ యార్లగడ్డ సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దారు సుశీల, మెడికల్ ఆఫీసర్ జెస్సీ రాణి, ఎంసిఓ పెద్ది వంశీ, ఈఓఆర్డి ఆర్ రమేష్ బాబు, పంచాయతీ సెక్రటరీ కె అంజయ్య, ఎపీఒ ప్రదీప్, ఎపిఎం మధుసూదన్, డాక్టర్ సురేష్ బాబు, శాంతి వైష్ణవి, సాయి కిషోర్, జె భవన్నారాయణ పాల్గొన్నారు.

సంతమాగులూరు : పేదలు ఆర్థిక ఇబ్బందులతో విద్యా, వైద్యానికి దూరం కాకూడదనే దృఢ సంకల్పంతో సిఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసీపీ కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మందుల కిట్లను అందజేశారు. ఎంపీపీ వై యలమంద అధ్యక్షతన జరిగిన సభలో చైతన్య మాట్లాడారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని అన్నారు. రాబోయే ఎన్నికలలో మరలా జగనన్ననే గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచి జమ్ముల నాగరాజు, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి అంకారావు, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీశేషు, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, అట్లా పెద్దవెంకటరెడ్డి, విప్పల ముసలారెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, తేలప్రోలు వెంకట్రావు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

నగరం : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. మండలంలోని పెదమట్లపూడి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్ సైదా నాయక్, ఎంపిటిసి కరీమ్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజశక్తి - చీరాల

మండలంలోని రైతులు అందరూ పంట నమోదులు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆర్బికే చైర్మన్ రమణారెడ్డి కోరారు. మండల స్థాయి సలహా మండలి సమావేశం స్థానిక ఎఓ కార్యలయంలో శుక్రవారం నిర్వహిం చారు. ఎడిఎ ఎప్రాయం మాట్లాడుతూ పంట నమోదును ఎప్పటికప్పుడు వెంటనే చేయాలని తెలిపారు. నీటిపారుదల ఎఇ పవన్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 3వేల ఎకరాల్లో వరి పంట వేశారని అన్నారు. రెండు వేల ఎకరాల్లో నాట్లు పడే అవకాశం ఉందని తెలిపారు. నర్సాయపాలెం లాక్కుల నుండి కారంచేడు వరకు కాలువలో ఆరడుగులు నీరు ఉండేలా ఉన్నతాధికారులకు తెలపాలని అన్నారు. సమావేశంలో ఎఓ సుమతి, డ్రైనేజీ ఎఇ డానియల్ పాల్గొన్నారు.



బట్టిప్రోలు సమావేశంలో చైర్మన్ రమేష్

పర్చూరు : స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో చైర్మన్ కోట హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సిబ్బందికి వివరించారు. ఎడిఎ ఎన్ మోహన్‌రావు మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీపై శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హబ్ మేనేజరు కె సమర్‌నాథ్, పశుసంవర్ధక శాఖ అధికారి కె అరుణ, ఉద్యానవన శాఖ అధికారి రవిప్రకాష్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా కమిటీ సమావేశం చైర్మన్ కుందేటి రమేష్ అధ్యక్షత నిర్వహించారు. మండలంలో ఇప్పటికే 95శాతంపైగా ఈ క్రాపు నమోదు చేసినట్లు తెలిపారు. అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డు నమోదు చేస్తామన్నారు. ఇప్పటివరకు 5400కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చామని, ఈనెల 15వరకు నమోదు చేసుకోడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయభాస్కరి, మండల అధ్యక్షులు కె పిచ్చయ్య శాస్త్రి పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఈవో సస్పెన్షన్

ప్రజాశక్తి - బాపట్ల

అనేక అవినీతి ఆరోపణలపై మండలంలోని అప్పికట్లలో దేవాదాయ శాఖ ఈఓగా వ్యవహరిస్తున్న వీరారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. 15రోజుల క్రితం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా గ్రామస్తుల నుండి విరాళాలు సేకరించి వాటి వినియోగంలో ఇష్టారీతిగా వ్యవహరించాడనే ఆరోపణల నేపథ్యంలో అప్పికట్ల గ్రూపు దేవాలయాల ఈఓ వీరారెడ్డిని సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు వారాలు గడిచినప్పటికీ ఇంకా విధుల్లో కొనసాగడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. దేవాదాయ శాఖలో జిల్లా స్థాయి అధికారులకు తెలియకుండా ఈ తంతు జరుగుతుందా అని విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా అప్పికట్ల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం స్థానికులతో కలిసి ఈఓ వీరారెడ్డి రూ.కోటికిపైగా విరాళాలు వసూలు చేశాడని చెబుతున్నారు. 12అంశాలకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డాడని దేవాదాయ కమిషనర్ ముఖ్య కార్యదర్శి, సిఎంకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన దేవాదాయ శాఖ డీసీ చంద్రశేఖరరెడ్డి ఈఓపై వచ్చిన ఆరోపణలు నిర్ధారిస్తూ ఈఓ వీరారెడ్డిని సస్పెండ్ చేస్తూ గత నెల 27న ఉత్తర్వులు ఇచ్చారు. అయినప్పటికీ గ్రూప్ దేవాలయాల ఈఓగా వీరారెడ్డి కొనసాగడంపై విస్మయానికి గురిచేస్తోంది. ప్రస్తుతం వలివేరు, ఇంటూరు, వెదుళ్ళపల్లి గ్రూపు దేవాలయాల ఈఓగా పనిచేస్తున్నారు. వీరారెడ్డి సస్పెండ్ కావడంతో ఈ నాలుగు గ్రూపు ఆలయాల బాధ్యతలను దేవదాయ శాఖ ఇన్ స్పెక్టర్ శ్యామలకు అప్పగించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే బాపట్ల దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ శ్యామలకు సస్పెండ్ అయిన ఈఓ బాధ్యతలను అప్పగించలేదు. దస్త్రాలు అందజేయలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండలతోపాటు ఉన్నతాది.కారులు కొమ్ము కాయడంతో దేవాదాయ కమిషనర్ ఆదేశాలను ఈఓ వీరారెడ్డి అడ్డుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే బాపట్ల జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ దీనిపై స్పందించక పోవడం సర్వత్ర విమర్శలకు దారితీస్తోంది.



దేవాదాయ శాఖ ఇఓ వీరారెడ్డి కార్యాలయం

సాగునీరివ్వకుంటే రాజీనామా చేస్తా

ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్



ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉండే కృష్ణా డెల్టా ప్రాంతం వైసీపీ పాలనలో ఎడారిని తలపిస్తోందని ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. సాగునీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అన్నారు. రైతులకు సాగునీరు ఇచ్చి ప్రభుత్వం తక్షణం ఆదుకోకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా ప్రకటించారు. కనీసం సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం దేనికని ప్రశ్నించారు. కృష్ణా నదీ జలాల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సాగునీటి కాలువల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యానికి రైతులు బలవుతున్నారని అన్నారు. సకాలంలో కాలువల పూడిక, తూటుకాడ తీయలేదన్నారు. కాలువల మరమ్మత్తులకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో చివరి ఆయకట్టుకు నీరందటం లేదని అన్నారు. కట్టలు బలహీన పడటంతో కొద్దిపాటి నీటిని విడుదల చేసినా కట్టలు తెగిపోతున్నాయని అన్నారు. రైతులు నష్టపోతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. దీంతో వేల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థంగా మారిందని అన్నారు. తమ ప్రభుత్వ కాలంలో పట్టిసీమ నీరు అందజేశామని అన్నారు. ఈ ప్రభుత్వ చేతకానితనం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. నిజాపట్నం, రేపల్లె, నగరం మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. పొట్ట దశలో ఉన్న పంటకు నీరు అత్యంత అవసరమన్న కనీస సృహ కూడా ప్రభుత్వానికి లేకపోవటం సిగ్గుచేటని అన్నారు. కళ్ల ముందే పంట ఎండిపోవటంతో రైతులు కన్నీరు పెడుతున్నారని అన్నారు. మరో వైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడంలేదన్నారు. అన్నదాతల్ని ఆదుకోలేని ప్రభుత్వం ఉంటే ఎంత? లేకుంటే ఎంత? కౌలు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతుల నోటికి చేతికి దూరం పెరిగిపోయిందని అన్నారు. జగన్ ప్రభుత్వం రైతు వెన్నెముకను విరగ్గొట్టిందని అన్నారు. రైతుల్ని కన్నీరు పెట్టించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని అన్నారు. కృష్టా జలాలు విడుదల చేసి డెల్టా ప్రాంత రైతుల్ని ఆదుకోవాలని కోరారు. రైతులు కోసం తాను ఏ త్యాగానికైనా సిద్ధమేనని అన్నారు. అవసరమైతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి వెనుకాడనని ప్రకటించారు. ఎంఎల్ఎ పదవి ప్రజలు పెట్టిన బిక్ష అని అన్నారు. వారి కంటే తనకు ఏ పదవి ఎక్కువ కాదని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నాగలినే శిలువగా మోస్తూ పోరాటానికి శ్రీకారం చుట్టి తక్షణమే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు.

సాగునీరిచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలి

- కాలువగట్లపై జంగిల్ క్లియర్ చేయలేని ప్రభుత్వం
- గుండ్లకమ్మ గేట్లు పెట్టకపోవడంలో కుట్రకోణం
- వైసిపి కనుసన్నల్లో ఇసుక మాఫియా
- రైతులు,పేదలపట్ల జగన్‌కు చిత్తశుద్ధి ఏది?

ప్రజాశక్తి - అద్దంకి

ఖరీఫ్ సీజన్ వచ్చి రోజులు గడుస్తుండటంతో పొలాలు దున్ని వర్షం కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితి ఏర్పడిందని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొన్ని చోట్ల బోర్లు కింద పంట సాగు చేశారని, ఈదశలో నీరు అందకపోతే పంట ఎండిపోయే ప్రమాదం ఉందని, నీటి సమస్యను పరిష్క రించి ఆదుకోవాలని పంగులూరు, బల్లికురవ మండలాల రైతులు ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లా డుతూ ఖరీఫ్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతులను ఆదుకోవాలని, వ్యవసాయానికి సరిపడా సాగర్ జలాలు విడుదల చేయాలని కోరారు. మాగాణి భూములకు సాగునీటిని అందించాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు నారుమళ్ళు పోసుకొని, నీళ్ళు వస్తాయో, లేదో అనే అయోమయ పరిస్థితి లో ఉన్నారని అన్నారు. కాలువల్లో నాచు తొలగించాలని కోరారు. లేకుంటే నీటి ప్రవా హానికి ఆటంకం కలుగుతుందని అన్నారు. నాలుగేళ్ల నుండి కాలువ గట్లపై జంగిల్ క్లియరెన్స్ చేయలేదన్నారు. గట్లు ప్రమా దకరంగా తయారయ్యాయని అన్నారు. గుండ్లకమ్మ జలాశయ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి 16నెలలు కావస్తున్నా నేటికీ అమర్చకపోవడం వైసిపి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. గేట్లు కొట్టు కుపోయి నీరు వృధాగా పోతుందని టిడిపి ఆందోళనలు చేస్తే ప్రాజెక్టులు సందర్శించిన జలవనరుల శాఖ మంత్రి నెల రోజులలోపే గేట్లు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారని ఎద్దేవా చేశారు. రైతుల కోసం పేదల కోసం అంటూ పదేపదే టీవీల ముందు మాట్లాడే సిఎం గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో సన్న చిన్న కారు రైతులు దాదాపు లక్ష ఎకరాలకుపైగా సాగు, రెండువేల మందిపైగా మత్స్యకార కుటుంబాలు జీవనం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉంటే ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇసుక మాఫియా కోసమే గేట్లు పెట్టలేదని ఆరోపిం చారు. ఉద్దేశపూర్వకంగా గేట్లు అమర్చకపోవడంతో తమ్మవరం, మణికేశ్వరం, అనమనమూరు, మోదేపల్లి నదీ పరీవాహక ప్రాం తంలో వైసిపి నేతల కను సన్న ల్లో మాఫియా ఇష్టా రాజ్యంగా చెలరేగిపోతుందని అన్నారు. తమ్మవరం రేవు వద్ద డ్రెజ్జర్లతో రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని అన్నారు. రైతులు, పేదల పట్ల ఈ సిఎంకు చిత్తశుద్ధి లేదని అన్నారు.

గొట్టిపాటి సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- సంతమాగులూరు

టిడిపికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మక్కెనవారిపాలెం అంకమ్మ గుడి నుండి పరిటాలవారిపాలెం ఎన్టీఆర్ విగ్రహం వరకు 10కిలోమీటర్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైసిపి కక్షపూరిత రాజకీయాలు పరాకాష్టకు చేరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలను చైతన్య పర్చడమే లక్ష్యంగా సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. వైసిపికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఈ ర్యాలీలో మహిళలు రవికుమార్‌కు హారతులు ఇచ్చారు. కొమ్మాలపాడులో ముస్లిం యువత మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ర్యాలీ ముందువరుసలో రవికుమార్ సైకిల్ తొక్కాడు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తేలప్రోలు రమేష్, ధూపాటి ఏసోబు, మాజీ ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, గొట్టిపాటి చౌదరి బాబు, కొనికి గోవిందమ్మ, ఏలూరి శ్రీనివాసరావు, నాగభోతు సుజాత, మోతాదు భాష, పసుపులేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటమి భయంతో బాబుపై అక్రమ కేసులు

ప్రజాశక్తి - చీరాల



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి టిడిపిని రాజకీయంగా ఎదుర్కొలేక అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపించారని టిడిపి యువనేత ఎంఎం గౌరీఅమర్నాద్ అన్నారు. టిడిపి ఇంచార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో బాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని రామకృష్ణాపురంలో టిడిపి నాయకులు పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. అందుకే అరెస్టు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఆదారాలు చూపలేకపోయారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మావూరి అజయ్ ఘోష్, అందే మేఘశ్యాముడు, తేళ్ల లక్ష్మీనరసయ్య, జగ్గారపు మల్లేశ్వరరావు, ఎస్‌కె బాబు, ఎడ్లపల్లి సురేష్, నల్లమోలు భాస్కరరావు, నాసిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, కంకణాల శ్యామ్, ఉసురుపాటి సురేష్, అనపర్తి రత్నబాబు, కౌతరపు జనార్ధనరావు, వడిలి అమర్, నరాల తిరుపతి రాయుడు, దగ్గుబాటి వెంకట్రావు, పులిపాటి శేఖర్, గోలి శ్రీనివాసరావు, గుంటి మల్లికార్జునరావు, బుర్ర రోశయ్య, ఎస్‌కె లాల్ అహ్మద్, వడ్లమూడి వెంకటేష్, శింగిరేసు కాళిదాసు, పఠాన్ గౌస్, బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోధనోపకరణాల బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి



బోధనోపకరణాలు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య – రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు పక్షాన రూ.5వేల విలువ చేసే 10కుర్చీలు, బోధనోపకరణాలు ఎన్టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు పుట్టంరాజ శ్రీరామచంద్ర మూర్తి బహూకరించారు. ఈసందర్భంగా జరిగిన సభకు పాఠశాల హెచ్ఎం కె అంజమ్మ అధ్యక్షత వహించారు. ఎన్‌టిఆర్ కాలనీ విద్యార్థులు పేదవారని, పాఠశాలకు కావలసిన కుర్చీలు, విద్యార్థులకు కావలసిన బోధనోపకరణాలు సమకూర్చడం ద్వారా మరింత నాణ్యమైన చదువును అందించే అవకాశం కలుగుతుందని హెచ్ఎం అంజమ్మ అన్నారు. రోటరీ అధ్యక్షులు చిన్నిమురళీకృష్ణ, వార్డు మెంబర్ గుంజి కోటేశ్వరరావు, కార్యదర్శి చప్పిడి వీరయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ తరగతిని ఆకర్షణీయవంతంగా ఉంచుకోవాలని కోరారు. ఒక మేలైన, మెరుగైన సమాజాన్ని రూపొందించడం ఉపాధ్యాయులు బాధ్యతగా గుర్తించాలని కోరారు. ర్యక్రమంలో నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, సందిరెడ్డి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, శైలజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆటో నాయకులు బుచ్చిరాజు

ఆటో యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - బాపట్ల

ఆటో వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 20న స్థానిక అంబేద్కర్ భవన్లో జరుగు తుందని యూనియన్ జిల్లా నాయకులు ఎం బుచ్చిరాజు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో ఆయన మాటా డారు. జిల్లాలో ఆటో వర్కర్లపై పెద్ద ఎత్తున పెనాల్టీలు విధిస్తున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. అనేక మండల కేంద్రాల్లో ఆటో స్టాండ్ లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటో విడిభాగాలు, ఆయిల్ ధరలు పెరగడంతో ఆటో వర్క ర్లకు ఆదాయవనరులు తగ్గాయని అన్నారు. ఆటో వర్కర్లను ఆదుకోవడం కోసం సమగ్ర చట్టాన్ని భవన నిర్మాణ కార్మికులు తరహాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 20న జరుగనున్న జిల్లా మహాసభలో అన్ని మండలాల నుండి ఆటో వర్కర్లు హాజరై జయప్రదం చేయాలని కోరా రు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సి హెచ్ మజుందార్, ఆటో యూనియన్ బాపట్ల నాయకులు వై వాసు, బి బ్రహ్మం, ఎ రామకృష్ణ, డి చిన్న పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో ఎంఎల్‌సి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

నేడు బాపట్ల రానున్న మంత్రి రోజా

ప్రజాశక్తి - బాపట్ల

పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఈనెల 14న బాపట్లకు రానున్నట్లు ఎంఎల్‌సి ఉమారెడ్డి వెంకటేశ్వర్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. తిరుపతి – కాకినాడ టౌన్ ఎక్స్ ప్రెస్ రైలు ద్వారా రోజా శనివారం ఉదయం బాపట్ల చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుండి సూర్యలంక బీచ్ హరిత రిసార్ట్స్‌కు వెళతారని తెలిపారు. అల్పాహారం అనంతరం మండలంలోని కొండుభొట్ల పాలెంలో జరిగే కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారని తెలిపారు. తన నిర్వహణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మృతి వనాన్ని మంత్రి రోజా ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడి శ్రీ వరసిద్ధి వినాయక వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారని అన్నారు. గ్రామంలో మహిళలతో సమావేశం అవుతారని తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాల అతిథి గృహానికి చేరుకుని భోజనం అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరిగి గుంటూరుకు వెళతారని తెలిపారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు పాల్గొన్నారు.

భాష్యంలో దసరా వేడుకలు

ప్రజాశక్తి - అద్దంకి

దసరా పండుగ సందర్భంగా ఈ నెల 14నుండి 25వరకు దసరా పండుగకు సెలవులున్న నేపథ్యంలో పట్టణంలోని బంగ్లా రోడ్డులోని భాష్యం ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ జివిఎస్ఆర్ శాస్త్రి ఆధ్వర్యంలో దసరా శరన్నవ రాత్రుల పండుగను శుక్రవారం చేశారు. అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బతుకమ్మను సిద్ధం చేసి ఆట పాటలుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో బాగంగా చిన్నారులు పలు వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శన చేశారు. పాఠశాలలో 8, 9, 10తరగతుల విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. వేడుకల్లో హెచ్ఎం కాకాని కల్పన, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

- సర్వజన ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలు
- జిజిహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్



మాట్లాడుతున్న డాక్టర్ భగవాన్‌నాయక్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు సర్వజన ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు కషి చేస్తున్నామని, బయట వ్యక్తులు సిబ్బందిని ప్రలోభాలకు గురిచేసినా లేదా సిబ్బంది ఎవరైనా ప్రలోభాలకు గురయినా వారిపై చర్యలు తీసుకుంటామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం జిజిహెచ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధునాతన పరికరాలతో నిబద్ధత కలిగిన సిబ్బందితో ప్రజలకు వైద్యం అందించేందుకు కషి చేస్తున్నామని, అయితే కొంతమంది బయట వ్యక్తులు రోగులకు, వారి సహాయకులకి మాయమాటలు చెప్పి వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అటువంటి వారికి జిజిహెచ్ ప్రాంగణంలో ప్రవేశం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వైద్య రంగంలో అనేక మార్పులు చేసిందని, అధునాతన పరికరాలు సమకూర్చిందని తెలిపారు. జిజిహెచ్ సిబ్బంది కూడా ఎలాంటి ప్రలోభాలకు గురయినా వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు జిజిహెచ్‌లో అందుతున్న వైద్యం గురించి అపోహలు పెట్టుకోవద్దని, ఉచిత వైద్యం అందించేందుకు జిజిహెచ్‌లో అన్ని రకాల సౌకర్యాలు వున్నాయని చెప్పారు. డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ అనిల్ మాట్లాడుతూ ఏదైనా సమస్య లేదా అనుమానం వస్తే వైద్య సిబ్బంది, ఆర్ఎంఒ, సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ లాంటి సదుపాయాలు వున్నాయని, ఒక వేళ అవసరమైతే గుంటూరు లేదా విజయవాడ జిజిహెచ్‌లకు పంపుతాం తప్ప మరే ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చెయ్యబోమన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఉన్నతికి కృషి

పూర్వ కలెక్టర్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-పొదిలి

పేదల ఐక్యత బడుగు బలహీన వర్గాల ఉన్నతికి కృషి చేయడమే తన లక్ష్యమని విశ్రాంత ఐఎఎస్ అధికారి, ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఐక్యత విజయపథం పాదయాత్రలో భాగంగా 60వ రోజు పొదిలి పట్టణంలోకి ప్రవేశించారు. ఈసందర్భంగా చిన్న బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల స్థితి గతుల అవగాహన కోసం, ఎస్సి, ఎస్టీ బీసీ మరియు మైనార్టీల సంక్షేమం కోసం తాను పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరువైనా, వారి జీవితాలలో ఎందుకు మార్పు రావడం లేదు అనే ప్రధానమైన అంశాల మీద అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినాపేద బడుగు బలహీన వర్గాలలో మార్పు రాకపోవడడం సమాజ అభివృద్ధికి అడ్డంపడుతుందన్నారు. అధిక జనాభా ఉన్న వారి నాయకత్వం పెంపొందించి వారిని సంఘటిత పరచి బలమైన శక్తిగా మార్పు చెందటం ద్వారా అధికారంలో భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పూర్వ కలెక్టర్ విజయ్‌కుమార్

అందులోభాగంగా పేదరికం నుంచి పేదలను విముక్తి చేయ్యంగా, వారిమధ్య ఐక్యమత్యమే లక్ష్యంగా ఐక్యతా విజయపథం పాదయాత్ర యాత్రను తలపెట్టినట్లు వివరించారు. పాదయాత్ర సందర్భంగా పొదిలిలోని బాప్టిస్ట్ పాలెం, నేత పాలెం దళిత వాడల్లో ప్రత్యేక సమావేశాల పేదలను కలిసి వారి సమస్యలను వింటూ అర్జీలు తీసుకున్నారు. చిన్నబస్టాండ్ లో బహిరంగ సభలో ప్రసంగించి అనంతరం మల్లవరం వెళ్లారు. నేత పాలెం, బాప్టిస్ట్ పాలెం వాసులు ఆయనను మేళతాళాలతో ఊరేగింపుగా కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర లో భాగంగా ఐఎఎస్ విజయకుమార్ నేడు పొదిలి లోని నేత పాలెం సందర్శించిన సందర్భంగా రాష్ట్ర వైసిపి కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస రెడ్డి ఆయనను కలిసి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండి అశోక్,ఒకటవ సచివాలయం కన్వీనర్ పావులూరి భాను ప్రసాద్, ఆరిక రాము, సంతోష్ నేతపాలెం యూత్ పాల్గొన్నారు.

ముండ్లమూరు: మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ యాత్ర ముండ్లమూరు మండలంలోని ప్రవేశిస్తున్నందున.. ఈ పాదయాత్రను విజయవంతం చేయవలసిందిగా దారా అంజయ్య పిలుపునిచ్చారు. ముండ్లమూరు అంబేద్కర్ విగ్రహం వద్ద విజయపథం యాత్ర కరపత్ర ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ముండ్లమూరు దళిత సంఘం నాయకులు పాలే పోగు డగ్లస్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడారు.

తాళ్లూరు: దళిత సంఘాల నాయకులు పులి వికాస్, బంటుపల్లి ప్రకాష్, పులుగు చిన్న మోషే, డి బిఆర్ సి ఏరియా కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, జి. ఫిలిప్‌రాజు మండలంలోని వివిధ గ్రామాల చెందిన నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఎస్‌జి ఎఫ్ఐ జూడో జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల క్రీడాకారుల ఎంపిక శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కె.వనజ ఆధ్వర్యంలో జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఖాజా మస్తాన్, సెక్రెటరీ ఏ .రవి పర్యవేక్షణలో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 50 మందికి పైగా బాలురు 50 మంది బాలికలు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన బాల బాలబాలికలను జూడో పోటీలకు ఎంపిక చేశారు.ఎంపిక కార్యక్రమంలో కామేపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు నర్రా కోటేశ్వరరావు గవండ్లపాలెం వ్యాయామ ఉపాధ్యాయులు చక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బాల బాలికలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాకల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి.హజరత్తయ్య తెలిపారు. జిల్లా స్థాయి జూడో ఎంపిక కార్యక్రమమును పాకలలో నిర్వహించడానికి అవకాశం ఇచ్చిన ఎస్జీఎఫ్ఐ సెక్రటరీ కె.వనజకి వ్యాయామ ఉపాధ్యాయుల పిల్లి హజరత్తయ్య కతజ్ఞతలు తెలిపారు.

సోనా బోట్లతో అర్ధరాత్రి వేట

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో శుక్రవారం అర్ధరాత్రి సోనా బోట్లు హల్ చల్ చేస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చి పట్టపగలతో పాటు రాత్రులు కూడా పాకల సముద్ర తీరంలోని ఒడ్డుకు వచ్చి మరి సముద్రంలో వేట చేస్తున్నాయి. వాటిని చూసిన మత్స్యకారులు ఏమి చేయలేక అలా ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

అద్దె చెల్లించలేదని

సచివాలయ కార్యాలయానికి తాళాలు..

రెండు గంటలపాటు బయట కూర్చున్న అధికారులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

అద్దె చెల్లించనందుకు కొనకనమిట్ల సచివాలయానికి భవన యజమాని పగడాల తిరుపతిరెడ్డి ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు తాళాలు వేశారు. దీంతో విధులు కోసం పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది బయట కూర్చున్నారు. దీంతో కార్యాలయ పనులకు అంతరాయం కలిగింది. మూడు సంవత్సరాల నుంచి అద్దె బకాయిలు సుమారు రూ.3 లక్షలకు పైగా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని యజమాని తిరుపతిరెడ్డి తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి కె రాజకుమారి నచ్చజెప్పారు. దీంతో తాళాలు తీయ్యటం కార్యకలాపాలు అవిధిగా కొనసాగాయి.



సచివాలయం బయట ఉన్న సిబ్బంది

సురక్ష సేవలు సద్వినియోగం చేసుకోండి

ఎంపిపి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి యద్దన పూడిశ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పి నాయుడుపాలెంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య సేవలు ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉండే విధంగా సురక్ష పథకం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ బొంత కరుణ ప్రియ, సంతోష్, ఎంపిటిసి కూడల అంజలీ మాలకొండయ్య, మాజీ ఎంపిటిసి కూరాకుల సుబ్బారెడ్డి, పల్లామల్లి సొసైటీ అధ్యక్షులు ఎస్ విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండలంలోని కండ్లగుంట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపిపి నలమలపు అంజమ్మ, కష్ణారెడ్డి దంపతులు, జడ్‌పిటిసి యాదల రత్నభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల అంజిరెడ్డి, ఎంపిడిఒ జయమణి, తహశీల్దార్ సుజన్ కుమార్ పాల్గొన్నారు.



శింగరాయకొండలో సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం

శింగరాయకొండ: శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని సచివాలయం-3లో శుక్రవారం నాడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈద్గా మిట్ట లోని షాదీ ఖానా వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎం పిడి ఓ షేక్ జమీఉల్ల వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ షేక్ షకీల శింగరాయకొండ గ్రామపంచాయతీ సర్పంచ్ తాటిపర్తి వనజ హాజరయ్యి జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వివరించారు.

వైసీపీని రాష్ట్రం నుండి తరిమికొట్టండి

మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

వైసిపిని, జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ అన్నారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడులో 'వైసీపీని రాష్ట్రం నుండి తరిమికొట్టండి-బాబుతో నేను' పేరుతో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి.. జైలులో కూడా సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ బాబు కడిగిన ముత్యం లాగా బయటకి వస్తారని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి పాటిబండ్ల అజయ్‌కుమార్, దేవబత్తిన ప్రసాదరావు, ఉపసర్పంచ్ ముత్తూరి మురళి, యూనిట్ ఇన్‌ఛార్జి దాసరి రమేష్, తెలుగు యువత చుండూరి రఘురాం, మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, మండవ గోపి, చింతల శ్రీను, కొప్పోలు అంకమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్